'స్వచ్ఛదనం-పచ్చదనం' ప్రారంభం



ర్యాలీ, వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

అత్తాపూర్‌: కాలుష్య మహమ్మారి తరిమి కొట్టేందుకు గ్రీనరీ పెంచడంతో పాటు ప్లాస్టిక్‌ వస్తువులను వినియోగించరాదని అత్తాపూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఒకరినిమించి మరొకరు పోటీపడుతూ ఉపాధ్యాయులను సంభ్రమాశ్చర్యాలను గురి చేశారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు జరిగే 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని అత్తాపూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుల ఆలోచనల మేరకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలతో పాటు వ్యక్తిత్వ పోటీలు నిర్వహించారు. ప్లాస్టిక్‌ వ్యర్థాలు వాటితో వచ్చే అనర్థాలపై వివరించారు.

స్వీపింగ్‌ పనుల పరిశీలన



స్వీపింగ్‌ పనులను పరిశీలిస్తున్న కమిషనర్‌ శరత్‌చంద్ర

బండ్లగూడ: కాళీమందిర్‌ మెయిన్‌రోడ్డు పై స్వీపింగ్‌ పనులను సోమవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ బి.శరత్‌చంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు తమ పనులను సక్రమంగా నిర్వహించినప్పుడే ప్రజలకు ఇబ్బందులు ఎదురుకావని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఈ యాదయ్య, ఏఈఈ రాజ్‌కుమార్‌, మున్సిపల్‌ శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ నరేష్‌, శానిటరీ జవాన్‌ నరేందర్‌, స్వీపర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత

శంషాబాద్‌: పట్టణంలోని సిద్ధాంతి బస్తీకి చెందిన పుష్పమ్మకు సీఎం సహాయనిధి నుంచి వచ్చిన చెక్కును సోమవారం రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ ఆమె కుమారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేదవారికి సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ఎంతో అండంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మంచర్ల శ్రీనివాస్‌, పోతుగంటి కిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

అంబేడ్కర్‌ భవనాన్ని పరిశీలించిన కార్పొరేటర్‌



భవనాన్ని పరిశీలించిన కార్పొరేటర్‌ అర్చన జయప్రకాష్‌

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్‌లోని అంబేద్కర్‌ భవన నిర్మాణాన్ని సోమవారం ఉదయం జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకోబా, సంఘం సభ్యులతో కలిసి డివిజన్‌ కార్పొరేటర్‌ అర్చన జయప్రకాష్‌ పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరిందని, పాత భవనాన్ని కూల్చి కొత్తగా భవనాన్ని నిర్మించాలని అధికారులకు సూచించారు. భవన నిర్మాణం కోసం 20 లక్షల రూపాయలను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులతో పాటు స్థానికులు భవన నిర్మాణాన్ని సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం చీఫ్‌ అడ్వైజర్‌ పచ్చ శ్రీనివాస్‌, సంఘం అధ్యక్షుడు సంజీవ జంగయ్య, శ్రీకాంత్‌, మాజీ వార్డు సభ్యుడు నారాయణ ముదిరాజ్‌, పంబాల రాజు, భీమయ్య, మహేష్‌ తదతరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనంతో పట్టణం మెరవాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌డీ శ్రీనివాస్‌

శంషాబాద్‌: పట్టణంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పురపాలక శాఖ రీజినల్‌ డైరక్టర్‌ శ్రీనివాస్‌ హాజరయ్యారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన స్వచ్ఛదనం-పచ్చదనంతో శంషాబాద్‌ పట్టణం మెరవాలని, పట్టణ పౌరులు అంతా భాగస్వామ్యమయ్యేలా కృషి చేయాలన్నారు. అంతేకాకుండా ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ సుష్మ, వైస్‌చైర్మన్‌ బండిగోపాల్‌, మున్సిపల్‌ కమిషనర్‌ సుమన్‌రావు, కౌన్సిలర్లు జహంగీర్‌ఖాన్‌, రేఖ, మేకల వెంకటేష్‌, అజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన రెడీమిక్స్‌ వాహనం



అదుపుతప్పి డివైడర్‌పై నిలిచిన రెడీమిక్స్‌ వాహనం

మణికొండ: అతివేగం కారణంగా అదుపు తప్పిన రెడీమిక్స్‌ వాహనం విద్యుత్‌ స్తంభాలను ఢీ కొట్టి డివైడర్‌పై నిలిచిపోయింది. ఆ సమయంలో రహదారిపై ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. రాజేంద్రనగర్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 6గంటల సమయంలో రాజేంద్రనగర్‌ డైరీ ఫాం నుంచి రాజేంద్రనగర్‌ వైపు వెలుతున్న రెడీమిక్స్‌ వాహనం వెటర్నరీ కళాశాల ముందుకు రాగానే అదుపుతప్పింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు రాకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్‌ నిద్రమత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగి ఉంటుందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

లావణీ పట్టాభూముల్లో లావాదేవీలు

ఆక్రమణను అడ్డుకున్న అధికారులు



భూమి చుట్టూ వేసిన కడ్డీలను ధ్వంసం చేసిన సిబ్బంది



ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది

మణికొండ: పేదలకు కేటాయించిన లావణీ భూమిపై కొందరు ప్రబుద్ధుల కన్ను పడింది. లావణీ పట్టాదారులతో నోటరీ పద్ధతిలో తక్కువ ధరకు కొనుగోలు పత్రం సృష్టించుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు భూమి చుట్టూ వేసిన కడ్డీలను ధ్వంసం చేశారు. గండిపేట మండలం, వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్‌ 132లో 8 ఎకరాల లావణీ పట్టా భూమి ఉంది. అందులో కొందరు గతంలో వర్షాధార పంటలు వేసుకుని జీవించేవారు. ప్రస్తుతం ఆ భూమి ఎంతో విలువైనదిగా మారటంతో దాన్ని అమ్మి సొమ్ము చేసుకోవాలనే కొందరు బేరసారాలకు దిగారు.

నోటరీ ద్వారా లావాదేవీలు..

లావణీ భూములు అమ్మకం, కొనటం చేస్తే చెల్లదు. అలాంటి లావాదేవీలు జరిగితే ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుంటుంది. కాబట్టి దాన్ని లావాణీ పట్టాదారులతో నోటరీ పద్ధతిలో తక్కువ ధరకు కొనుగోలు పత్రం సృష్టించుకునే కొత్త పథకం రచించారు. రిజిస్ట్రేషన్‌ రూపంలో కాకుండా నోటరీ ద్వారా 8 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. అందులో గత కొన్ని రోజుల నుంచి రాత్రి సమయంలో మట్టి పోయటం, చదును చేయటం చేస్తున్నారు. గత రెండు రోజులుగా ఏకంగా చుట్టూ ఫెన్సింగ్‌ వేసే పనులను మొదలు పెట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్‌ పనులు చేయిస్తున్న తెల్లాపూర్‌ దాసుపై గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం భూమికి వేస్తున్న ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి గదిని కూల్చివేశారు. సదరు భూమి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులను ఏర్పాటు చేశారు. ఇదే తరహాలో సర్వే నెంబర్‌ 131లోనూ చదును చేసి, గుడిసెలు వేసి ఆక్రమణలకు పాల్పడుతున్న 10 మందిపై కేసు నమోదైందని త్వరలోనే వాటిని సైతం తొలగిస్తామని రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ క్యాబ్‌ డ్రైవర్‌ మృతి



వెంకటేష్‌గౌడ్‌ (ఫైల్‌)

రాజేంద్రనగర్‌: ఉప్పర్‌ పల్లి ప్రాంతంలో క్యాబ్‌ డ్రైవర్‌ పై దాడి కేసును రాజేంద్రనగర్‌ పోలీసులు సోమవారం హత్య కేసుగా నమోదు చేశారు. చికిత్స పొందుతూ క్యాబ్‌ డ్రైవర్‌ మృతి చెందడంతో 15 మంది యువకులపై హత్యకేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ క్యాస్ట్రో తెలిపారు. ఇన్‌స్పెక్టర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి సాయిరెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన వెంకటేష్‌గౌడ్‌ (27)బీఎన్‌రెడ్డినగర్‌ ప్రాంతంలో అద్దెకు ఉంటూ ఎస్‌ఐ కావడం కోసం శిక్షణ పొందుతున్నాడు. రాత్రి సమయంలో క్యాబ్‌ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. 2022వ సంవత్సరం జూలై 31న రాత్రి సమయంలో ఉప్పర్‌ పల్లి ప్రాంతానికి చెందిన వివేక్‌ రెడ్డి యాప్‌ ద్వారా క్యాబ్‌ బుక్‌ చేశాడు. ఈ బుకింగ్‌ స్వీకరించిన వెంకటేష్‌గౌడ్‌ తన కారులో వివేక్‌ రెడ్డిని ఉప్పర్‌ పల్లి ప్రాంతానికి తీసుకువచ్చాడు. క్యాబ్‌ రేటు 900 కావడంతో కస్టమర్‌గా ఉన్న వివేక్‌ను అడిగాడు. లేదు 700 రేటు చూపించిందని వాగ్వాదానికి దిగాడు. వివేక్‌ తన స్నేహితులైన వంశీరెడ్డికి ఫోన్‌ ద్వారా తెలిపాడు. ఉప్పర్‌పల్లిలో ఓ విందులో ఉన్న వివేక్‌ మిగత స్నేహితులు శ్రవణ్‌రెడ్డి, ఆకాశ్‌ రెడ్డి, అంకిత్‌రెడ్డి, మహేందర్‌గౌడ్‌, మనోజ్‌, శివకుమార్‌, అజయ్‌ ముదిరాజ్‌, నరేందర్‌, శివకుమార్‌, మల్లారెడ్డి, శ్రీకాంత్‌ రెడ్డి, మణికంఠ రెడ్డి, వరుణ్‌రెడ్డిలు హాకి స్టిక్‌లు, బ్యాట్‌, కర్రలతో డ్రైవర్‌ వెంకటేష్‌పై దాడి చేశారు. దాడి చేసిన వారే పోలీసులకు ఫోన్‌ ద్వారా సమాచారం అందించి పోలీసులకు అప్పగించారు. ఈనేపథ్యంలో వెంకటేష్‌గౌడ్‌ను పోలీస్‌స్టేషన్‌లో ఉంచడంతో రాత్రి నెత్తురుతో వాంతులు చేసుకువడంతో ఉదయం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ కోమాలోకి వెళ్లాడు. మొదట పోలీసులు 324 సెక్షన్‌ క్రింద కేసు నమోదు చేయగా వెంకటేష్‌గౌడ్‌ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజ్‌ ఆధారంగా 15 మందిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఇంట్లోనే చికిత్స పొందుతున్న వెంకటేష్‌గౌడ్‌ ఆదివారం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. దీంతో పోలీసులు 15 మందిపై హత్య కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



సుమలత (ఫైల్‌)

మణికొండ: కాలీమందిర్‌ నుంచి నక్కలపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను ఓ కారు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాల పాలైన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. నార్సింగి పోలీస్‌ స్టేషన్‌, హైదర్‌షాకోట్‌ సెక్టార్‌ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌ మండలం నక్కల పల్లికి చెందిన జైపాల్‌, సుమలత(36)లు శనివారం రాత్రి కాలీమందిర్‌ వద్ద ఉన్న ఆమె అక్క ఇంటికి వచ్చారు. తిరుగుప్రయాణంలో రాత్రి 10గంటల సమయంలో గుర్తు తెలియని కారు వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో జైపాల్‌కు స్వల్ప గాయాలు కాగా సుమలతకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చేరిన ఆమె చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఫిర్యాదు అందుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్థానిక సంస్థల ఎన్నికలలో సగరుల సత్తా చాటుతాం

నగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌ సగర




మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌

రాయదుర్గం: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలలో సగరుల చైతన్యాన్ని చూపుతామని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌ సగర స్పష్టం చేశారు. సోమవారం గచ్చిబౌలిలోని సగర సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనబలం లేక చట్టసభల్లో అడుగుపెట్టడానికి అవకాశం లేని తమ జాతి భవిష్యత్‌లో రాజకీయాలను శాసించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేస్తామన్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో వేలాదిమందితో సగర చైతన్య సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు హరికిషన్‌, నాయకులు సత్యం, వడ్డకొండ కుమారస్వామి, ఆంజనేయులు, ఆస్కాని మారుతి, సురేష్‌, మహేందర్‌, సాయిగణేష్‌, స్రవంతి ,24 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, రాష్ట్ర యువజన సంఘం, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు

రాయదుర్గం: శ్రావణమాసం మొదటి సోమవారంను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. రాయదుర్గం, నానక్‌రాంగూడ,ఖాజాగూడ, గౌలిదొడ్డిలోని శివాలయం, గోపన్‌పల్లి, ఎన్టీఆర్‌నగర్‌, గచ్చిబౌలి, జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌, కొండాపూర్‌, కొత్తగూడ తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు వెళ్లారు.



కాలనీల్లో అంతర్గత రోడ్లకు మరమ్మత్తులు



గచ్చిబౌలి డివిజన్‌ వినాయకనగర్‌లో గుంతలు పడ్డ బీటీ రోడ్డు

రాయదుర్గం: కాలనీలు, బస్తీలలో బీటీ రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు జీహెచ్‌ఎంసీ అధికారులు. శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలలోని అంతర్గత రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశంపై జోనల్‌ కమిషనర్‌, డిప్యూటీ కమిషనర్‌ సూచనల మేరకు సర్కిల్‌ ఈఈ శ్రీనివాస్‌, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీశ్వర్‌, ఏఈ సమంత పర్యవేక్షణలో గచ్చిబౌలి డివిజన్‌ పరిధిలోని వినాయకనగర్‌లో రోడ్ల మరమ్మతు పనులను ప్రారంభించారు. దశలవారీగా అన్ని కాలనీలు, బస్తీలలో పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.

సీబీఐటీలో బీఈ ఎలక్ట్రానిక్స్‌ ఇంజనీరింగ్‌ కోర్సు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి బీఈ ఎలక్ట్రానిక్స్‌ ఇంజనీరింగ్‌ కోర్సును ప్రవేశపెట్టామని కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ సీవీ నరసింహులు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, ఏఐసీటీఈల నుంచి అనుమతి పొందామని ఆయన వివరించారు. వీఎల్‌ఎస్‌ఐ డిజైన్‌, టెక్నాలజీకి దేశంలో డిమాండ్‌ ఎక్కువగా ఉందన్నారు. ఇంజనీరింగ్‌ కళాశాలలో ఈ కోర్సును పూర్తి చేసుకున్న ఫ్రెషర్స్‌కు సంవత్సరానికి రూ.10లక్షలు, ఎన్‌ఐటీ, ఐఐటీ ఫ్రెషర్స్‌కు రూ.15 నుంచి 20లక్షల జీతం లభిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెద్ద మూడు సెమీ కండక్టర్‌ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిందని, రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగాలు పెరుగుతాయన్నారు.

'సికిల్‌ సెల్‌ సొసైటీ' లో జీఎఎన్‌ఎస్‌ఐడి బృందం

సాక్షి,సిటీబ్యూరో: నగరం వేదికగా పనిచేస్తున్న తలసీమియా సికిల్‌ సెల్‌ సొసైటీని ఇదే అంశంపై అంతర్జాతీయంగా పనిచేస్తున్న (టిఎస్‌సిఎస్‌) ది గ్లోబల్‌ యాక్షన్‌ నెట్‌వర్క్‌ ఫర్‌ సికిల్‌ సెల్‌ అండ్‌ అదర్‌ ఇన్‌హెరిటెడ్‌ బ్లడ్‌ డోనర్స్‌ (జీఎఎన్‌ఎస్‌ఐడి) బృందం సందర్శన సోమవారంతో ముగిసింది. తమ 3 రోజుల నగర పర్యటన సందర్భంగా.. బృంద సభ్యులు శివరాంపల్లిలోని సొసైటీ ఆవరణలో టిఎస్‌సిఎస్‌ ప్రతినిధులతో పాటు రోగులు, వైద్యులతో సంభాషించారు. ఈ జీఎఎన్‌ఎస్‌ఐడి బృందంలో ఢిల్లీకి చెందిన నేషనల్‌ హెల్త్‌ అథారిటీ సీనియర్‌ ఎక్స్‌పర్ట్‌ డా.వినితా శ్రీవాస్తవ, తలస్సేమిక్స్‌ ఇండియా సెక్రటరీ శోభ తులి, ఎయిమ్స్‌లో హెమటాలజీ ప్రొఫెసర్‌ డా.తులికా సేథ్‌ తదితర ప్రముఖ వైద్యులు, నిపుణులు ఉన్నారు.

కొత్త ఔషధాలు అభివృద్ధిని నిర్ధారిస్తాయి

రాయదుర్గం: కొత్త ఔషధాలు అభివృద్ధిని నిర్ధారిస్తాయని నేషనల్‌ యానిమల్‌ రిసోర్స్‌ ఫెసిలిటీ ఫర్‌ బయోమెడికల్‌ రీసెర్చ్‌(ఎన్‌ఏఆర్‌ఎఫ్‌బీఆర్‌)-ఐసీఎంఆర్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ముఖేషకుమార్‌ పేర్కొన్నారు.గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఫెడరేషన్‌ ఆఫ్‌ ఏషియన్‌ బయోటెక్‌ అసోసియేషన్స్‌ (ఎఫ్‌ఏబీఏ), హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివ ర్శిటీ, సైన్స్‌గురు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్‌ డిస్కవరీ అండ్‌ డెవలప్‌మెంట్‌ వర్క్‌షాప్‌ మూడవరోజు ఆన్‌లైన్‌లో ఆయన మాట్లాడుతూ బయో ఫార్మాస్యూటికల్‌ పరిశోధన పరిశ్రమ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. ఏడీజీవైఎల్‌ లైఫ్‌ సైన్సెస్‌ ప్రతినిధి డాక్టర్‌ కెఎస్‌రావు మాట్లాడుతూ ఔషధ ఆవిష్కరణ, అభివృద్ధికి ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలన్నారు.గిలియడ్‌ సైన్సెస్‌ ప్రతినిధి డాక్టర్‌ వైష్ణవిగంటి మాట్లాడుతూ ఆంకాలజీ చికిత్సలో ఔషధం భవిష్యత్తును రూపొందిస్తుందన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం



స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న ఉపకమిషనర్‌ రవికుమార్‌

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం డివిజన్‌లలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా డివిజన్‌లోని పలు కాలనీలలో పరిసరాలను రాజేంద్రనగర్‌ సర్కిల్‌ ఉపకమిషనర్‌ రవికుమార్‌ శుభ్రం చేయించారు. సోమవారం లక్ష్మిగూడ శ్మశాన వాటికలో జీహెచ్‌ఎంసీ సిబ్బందితో పిచ్చి మొక్కలను శుభ్రం చేయించారు. అనంతరం రవికుమార్‌ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి ముందు చెత్త చెదారం లేకుండా శుభ్రంగా ఉండే విధంగా ప్రజలు అలవాటు చేసుకోవాలని, పచ్చదనం కోసం ప్రతి ఇంటి ముందు మొక్కలను పెంచుకోవాలని స్థానికులను కోరారు. స్వచ్ఛదనం-పచ్చదనం అయిదు రోజులు ప్రతి కాలనీలో నిర్వహిస్తామన్నారు.

ఎంజీఐటీ సహాయ ప్రొఫెసర్‌కు డాక్టరేట్‌



డాక్టరేట్‌ అందుకుంటున్న కాశీనాథ్‌

మణికొండ: గండిపేటలోని మహత్మాగాంధీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో ఇంగ్లీషు సహాయ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కె. కాశీనాథ్‌కు తమిళనాడులోని వేలూరు ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ యూనివర్శిటీ (విట్‌) సోమవారం డాక్టరేట్‌ ప్రధానం చేసింది. ఆన్‌లైన్‌ విద్య, రాష్ట్రంలోని ఎంపిక చేసిన జిల్లాలోని ఆంగ్ల మాధ్యమిక స్థాయి ఉపాధ్యాయుల అభ్యాసాలు, సవాళ్లు అనే అంశంపై ఆంగ్లంలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్‌ ప్రధానం చేసినట్టు ఆయన తెలిపారు. యూనివర్శిటిలో జరిగిన కార్యక్రమంలో వైస్‌ ఛాన్సలర్‌ విశ్వనాథ్‌, ముఖ్యఅథితి ప్రొఫెసర్‌ అనిల్‌ల చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంజీఐటీ ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ జి.చంద్రమోహన్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్‌ హెడ్‌ డాక్టర్‌ హరిలీలలతో పాటు సహ అధ్యాపకులు ఆయనను అభినందించారు. తన డాక్టరేట్‌ను తన తల్లి జానకీదేవి, తండ్రి శ్రీనివాసరావులకు అంకితం చేస్తున్నానని కాశీనాథ్‌ తెలిపారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న ఇరిగేషన్‌ అండ్‌ సీఏడి స్పెషల్‌ సెక్రటరీ ప్రశాంత్‌ జీవన్‌పాటిల్‌, అడిషనల్‌ కలెక్టర్‌ ప్రతిమసింగ్‌ తదితరులు



ప్రారంభమైన స్వచ్ఛదనం-పచ్చదనం



మొక్కలు నాటుతున్న జీవన్‌పాటిల్‌, ప్రతిమసింగ్‌

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది. మున్సిపల్‌ కార్పొరేషన్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం కాళీమందర్‌ నుంచి ర్యాలీని నిర్వహించారు. ఇరిగేషన్‌ అండ్‌ సీఏడి స్పెషల్‌ సెక్రటరీ ప్రశాంత్‌ జీవన్‌పాటిల్‌, అడిషనల్‌ కలెక్టర్‌ ప్రతిమసింగ్‌, కార్పొరేషన్‌ మేయర్‌ లతా ప్రేమ్‌గౌడ్‌, డిప్యూటీ మేయర్‌ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలు హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఎస్‌ఎంపీ స్కూల్‌, హైదర్షాకోట్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గౌతమ్‌ మోడల్‌ స్కూల్‌, రావుస్‌ స్కూల్‌ విద్యార్థులు కాళీమందిర్‌ వరకు పలు స్లోగన్స్‌తో ర్యాలీని నిర్వహించారు. ఉడిపి హోటల్‌ ఎదురుగా ఉన్న మెయిన్‌ రోడ్డు పక్కన గల చెత్త పాయింట్‌ వద్ద బ్యూటీఫికేషన్‌ కోసం ప్రజలు చెత్త వేయకుండా ఉండాలని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌ బి.శరత్‌చంద్ర, కార్పొరేటర్లు అస్లాం, శ్రీనాథ్‌రెడ్డి, రాము, అనిత, రవీందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌, మేనేజర్‌ మంజులత, డిఈఈ యాదయ్య, అంగన్‌వాడీ టీచర్లు, స్వీపర్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



పెద్దగోల్కొండలో మొక్క నాటిన పంచాయతీ రాజ్‌ ప్రిన్సిపల్‌ సెక్రటరీ లోకేష్‌కుమార్‌



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్‌ ప్రిన్సిపల్‌ సెక్రటరీ

శంషాబాద్‌ రూరల్‌: మొక్కల సంరక్షణతో పాటు పారిశుద్ధ్య నిర్వహణలో అందరూ భాగస్వాములు కావాలని పంచాయతీ రాజ్‌ ప్రిన్సిపల్‌ సెక్రటరీ లోకేస్‌కుమార్‌ సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పెద్దగోల్కొండ, శంకరాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎరువు తయారు చేసుకోవాలన్నారు. సీజనల్‌ వ్యాధుల నివారణకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో డంపింగ్‌ యార్డు, ప్రకృతి పల్లెవనం, నర్సరీలను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సురేష్‌మోహన్‌, ఎంపీఓ ఉష, తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' విజయవంతం చేయండి

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌ కోరారు. సోమవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చింతచెట్టు చౌరస్తా నుంచి మున్సిపల్‌ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీల పరిధిలో రోడ్ల పక్కన చెత్తా చెదారం వేయకూడదన్నారు. ఐదు రోజుల పాటు ప్రభుత్వం సూచించిన కార్యక్రమాలలో భాగంగా నీటి ట్యాంకులను శుభ్రం చేయటం, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రుల ఆవరణలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ కె. నరేందర్‌ముదిరాజ్‌, వైస్‌ చైర్మన్‌ కె. నరేందర్‌రెడ్డి, కమిషనర్‌ డి. ప్రదీప్‌కుమార్‌, మేనేజర్‌ శ్రీధర్‌, ఏఈ సంజయ్‌లతో పాటు కౌన్సిలర్‌లు, కోఆప్షన్‌ సభ్యులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కోకాపేట ర్యాలీలో పాల్గొన్న నార్సింగి మున్సిపల్‌ ప్రజాప్రతినిధులు, అధికారులు



మణికొండలో ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌

అనంతరం 10,13,16,18 వార్డులలో డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు.

నార్సింగిలో...

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన సమావేశం, ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు, వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ జి.విజయ్‌బాబు, మేనేజర్‌ యోగేష్‌, డీఈ నరసింహారాజు, ఏఈ శ్రీనివాస్‌లతో పాటు కౌన్సిలర్‌లు, మున్సిపల్‌ కార్మికులు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230